# మా దేవుడు కేసీఆరే

- అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లు
- భూసమస్యలు తీర్చి, పట్టాలిచ్చిండు
- మళ్లీ ఆయననే గెలిపించుకుంటాం
- సిద్దిపేట జిల్లా కొత్తపేట, ఇటిక్యాల గ్రామస్థుల ఏకగ్రీవ తీర్మానం
- ఎఫ్‌డీసీ చైర్మన్‌కు ప్రతుల అందజేత
- వట్టిపల్లిలో బీఆర్‌ఎస్ ప్రచారం

జగదేవ్‌పూర్, నవంబర్ 6: సీమాంధ్ర పాలకుల చెర నుంచి తెలంగాణకు విముక్తి కల్పించిన ఉద్యమనేత, సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అద్భుతంగా ముందుకు నడుపుతున్నారని సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం కొత్తపేట, ఇటిక్యాల గ్రామాల ప్రజలు శ్లాఘించారు. ఎన్నో దశాబ్దాల నుంచి కొనసాగుతున్న తమ భూసమస్యలను పరిష్కరించి పట్టాలు అందించిన సీఎం కేసీఆర్‌ను దేవుడిగా కొనియాడారు. అటువంటి గొప్ప నాయకుడిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుందామని గ్రామస్తులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. సోమవారం ఆ తీర్మాన పత్రాలను కొత్తపేట సర్పంచ్ వెంకట్‌రామ్‌రెడ్డి, ఉపసర్పంచ్ మహేశ్ ఆధ్వర్యంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం సీఎం కేసీఆర్‌కు రెండు కండ్లని పేర్కొన్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసం మాయమాటలు చెప్పే విపక్ష నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. సీఎం కేసీఆర్‌ను కనీసం లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో సైనికుల్లా పనిచేయాలని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, బీజేపీకి ఓట్లేస్తే మళ్లీ కష్టాల పాలవ్వాల్సిందేనన్న విషయాన్ని ప్రజలందరికీ వివరించాలని కోరారు.

### దివ్యాంగుల సంపూర్ణ మద్దతు

బీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలుపతూ వట్టిపల్లె వికలాంగ నాయకులు బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాదాకృష్ణశర్మతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇప్పటికే తమకు నెల నెలా రూ.4 వేల పెన్షన్ అందిస్తున్న సీఎం కేసీఆర్.. ఈసారి ఆ మొత్తాన్ని రూ.6,016 పెంచుతామని ప్రకటించడం సంతోషదాయకమని పేర్కొన్నారు.



సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం కొత్తపేటలో సీఎం కేసీఆర్‌కు ఓటేస్తామని ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డికి అందజేస్తున్న నాయకులు

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

## విద్యా - ఉద్యోగ సమాచారం

### ప్రతి నెలా స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) : పాఠశాల విద్యలో గుణాత్మక మార్పు కోసం పలు సంస్కరణలు చేపడుతున్న విద్యాశాఖ తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకొన్నది. ప్రతి నెల 4 నుంచి 7 వరకు స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్స్ నిర్వహించాలని ఆదేశించింది. 50శాతం టీచర్ల చొప్పున ఈ సమావేశాలకు హాజరుకావాలని సూచించింది. తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య వంటి కార్యక్రమాల అమలుపై చర్చించాలని ఆదేశించింది. ఇది వరకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు అరకొరగా ఉండేవని, ఇక నుంచి పటిష్ఠంగా నిర్వహించాలని తెలిపింది. ఆయా సమావేశపు ఎజెండాను కూడా విద్యాశాఖ ఖరారు చేసింది.

### 9 నుంచి అగ్రికల్చర్ గురుకులాల్లో ప్రవేశాలు

హైదరాబాద్, నవంబర్6 (నమస్తే తెలంగాణ): బీసీ గురుకుల అగ్రికల్చర్ మహిళా కాలేజీల్లో బీఎస్సీ (హానర్స్) కోర్సులో ప్రవేశాలకు 9 నుంచి అగ్రిసెట్ మొదటి విడత, ఎంసెట్ రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఎంజేపీ సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్యభట్టు తెలిపారు. అగ్రిసెట్–2023లో వచ్చిన ర్యాంకుతోపాటు గురుకుల అగ్రికల్చర్ డిగ్రీ కాలేజీ సీటు కోసం దరఖాస్తు చేసుకొన్న అమ్మాయిలే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని స్పష్టంచేశారు. కౌన్సెలింగ్ వివరాలు https://mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్‌కు అన్ని సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

## బీఆర్‌ఎస్సే మనకు అండాదండ

ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ దూసుకెళ్తున్నది. ప్రతి నియోజకవర్గంలో అభ్యర్థుల ప్రచారం జోరుగా కొనసాగుతున్నది. బీఆర్‌ఎస్ అభ్యర్థులకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. తాము చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం డాకూర్, కొడెకల్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పార్టీ మ్యానిఫెస్టోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో గురించి వివరించగా వారి నుంచి విశేషమైన స్పందన వచ్చింది. 'బీఆర్‌ఎస్సే మనకు అండాదండ' అని స్థానికులు నినదించారు.

*- అందోల్*






















